క్లుప్తంగా

తాగునీటి సమస్య రాకుండా చూడండి

సామర్లకోట: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు బోర్‌వెల్ ఆపరేటర్లను ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రెండు మినరల్ వాటర్ ప్లాంట్లు వినియోగంలోకి తీసుకు వచ్చామన్నారు. గోదావరి కాలువలో నీరు లేకపోవడం, ఫిల్టర్ చెరువులో నీరు నాచు పట్టడంతో కుళాయిల ద్వారా ఆకుపచ్చ రంగులో నీరు వస్తుందని తెలిపారు. ఈ సమస్య నివారణకు మున్సిపాలిటీ పరిధిలోని బోర్లను వినియోగంలోకి తీసుకు వచ్చామని చెప్పారు. ఈ మేరకు ప్రజలకు బోరు నీటిపై అవగాహన పెంచాలని సూచించారు. ఫిల్టర్ చెరువులో నీటి కంటే బోరు నీరు శ్రేష్టమని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలకు సచివాలయ కార్యదర్శులు, తాగునీటి ఆపరేటరింగ్ సిబ్బంది తెలియజేయాలన్నారు.

శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం



మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న అరబిందో ప్రతినిధులు

కొత్తపల్లి: అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకినాడ సెజ్ ప్రాంతంలో మహిళలకు కుట్టు శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శుక్రవారం ఆ సంస్థ ప్రతినిధులు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ప్రతిభా కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న 25 మంది మహిళలకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ జనరల్ మేనేజర్ సుధాకర్, కాకినాడ సెజ్ ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ చామకూర వీరన్న సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మకు శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పూజలు నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో చండీ హోమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరై వేడుకలను తిలకించారు.

వైభవంగా ధ్వజారోహణం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ధ్వజారోహణం నిర్వహించారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో అర్చకులు నిత్యపూజలు, కైంకర్యాలు నిర్వహించారు. గోవింద మాలధారణ భక్తులు స్వామివారికి పల్లకీ సేవ చేశారు. యాగశాల ప్రవేశం, అగ్నిపూజ, మండలారాధన తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఊరి మీదకు వచ్చేశాయ్..

- పట్టణంలో పందుల స్వైరవిహారం
- అంటువ్యాధులపై ప్రజల ఆందోళన

సామర్లకోట: వరాహాలు ఊరి మీదకొచ్చేశాయి.. విచ్చలవిడిగా సంచరిస్తూ జనజీవనానికి ఆటంకం కలిగిస్తున్నాయి.. సామర్లకోట పట్టణంలో ప్రతి వార్డు, వీధి చూసినా పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. మురికి వార్డుల్లో పరిస్థితి మరింత చేయిదాటుతోంది. పందులను కుట్టిన దోమలు మనుషులను కుడితే మెదడు వాపు వ్యాధి వస్తుందని ఇప్పటికే డాక్టర్లు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. పందుల సమస్య నివారించాలని అధికార, ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నా వాటికి పరిష్కారం మాత్రం లభించడం లేదు. డ్రెయిన్లు, చెత్త పెరిగిన ప్రాంతాల్లో పందులు పొర్లుతున్నాయి. బీసీ బాలికల హాస్టల్ వద్ద మురుగునీరు నిలిచి ఉండటంతో ఆ ప్రాంతంలో వీటి సంచారం మరింత అధికంగా ఉంది. ప్రజలు, కౌన్సిలర్లు ఆందోళనలు చేసిన సమయంలో అధికారులు ఆయా ప్రాంతాలకు వెళ్లి పందుల పెంపకందారులతో సమావేశాలు నిర్వహించి పందులను పట్టణానికి దూరంగా పెంచుకోవాలని హెచ్చరికలు జారీ చేసి చేతులు దులుపుకొంటున్నారు. తర్వాత పరిస్థితి షరామామూలే. పట్టణ పరిధిలోని పందుల పెంపకందారులు తమకు మున్సిపాలిటీ స్థలం కేటాయిస్తే ఆ ప్రాంతంలో పందుల పెంపకం చేసుకొంటామని మున్సిపల్ అధికారులకు తెలియజేయడంతో సమస్య పరిష్కారం కావడం లేదు. కొంతమంది పెంపకందారులు ఇళ్ల మధ్య పందులను పెంచుతున్నారని, దాంతో భరించలేని దుర్వాసన వస్తుందని ఆయా ప్రాంతాల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హోటళ్లలో మిగిలిపోయిన వ్యర్థాలను తీసుకువచ్చి పందులకు ఆహారంగా వేస్తున్నారు. దీంతో చెడు వాసన వస్తుందనే వాదనలు ఉన్నాయి.

వెంటాడుతున్న వ్యాధుల భయం

ప్రస్తుత సీజన్‌లో పందులతో జ్వరాలు, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వస్తున్నాయని ప్రజలు భయపడుతున్నారు. పందులు రోడ్లపై స్వైర విహారం చేయడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగాయి. గతంలో పందులను పట్టుకుని దూర ప్రాంతాలకు తరలించారు. ప్రస్తుతం వీటి సంఖ్య మరింత ఎక్కువైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సామర్లకోటలో పందుల స్వైర విహారం

నివాస ప్రాంతాల్లో పెంపకం



పేదలు నివాసం ఉండే ప్రాంతాల్లో పందుల స్వైర విహారం ఎక్కువగా ఉంది. ఇక్కడ పందుల పెంపకం జరుగుతున్నట్లు అధికారులు గుర్తించినా చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. చాలా వార్డుల్లో పందుల స్వైర విహారం ఎక్కువగా ఉంది. పందులు వీధుల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలి. వర్షాలు ప్రారంభం కావడంతో శ్రద్ధ చూపాలి.

– రెడ్డి శ్రీనివాసరావు, వైఎస్సార్ యువసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి, సామర్లకోట

ఇప్పటికే హెచ్చరికల జారీ



పట్టణంలో పందులు తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వాటి పెంపకందారులకు హెచ్చరికలు జారీ చేశాం. మరో పర్యాయం వారితో సమావేశాలు నిర్వహించి వీధుల్లోకి పందులు రాకుండా చూస్తాం. గతంలో పందులు పట్టించాం. సమస్య పరిష్కారానికి అన్ని చర్యలూ తీసుకుంటాం.

– జె.రామారావు, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

పాదగయ క్షేత్రాన్ని దర్శించిన రక్షా రామయ్య



రక్షా రామయ్యకు ఆశీర్వచనాలు అందజేస్తున్న ఆలయ అర్చకులు

పిఠాపురం: పిఠాపురం పాదగయ క్షేత్రాన్ని కర్నాటక రాష్ట్రంలోని చిక్‌బల్లాపూర్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రక్షా రామయ్య శుక్రవారం సతీసమేతంగా దర్శించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే పెండెం దొరబాబుతో కలిసి కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవారు దత్తాత్రేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

సామర్లకోట: స్థానిక 33/11 కేవీ సబ్ స్టేషన్‌లోని 11 కేవీ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏబీఎస్‌డీఎస్ ప్రభాకర్ శుక్రవారం రాత్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కారణంగా పట్టణ పరిధిలోని బళ్లమార్కెట్, విఘ్నేశ్వరా థియేటర్, వీర్రాఘవపురం ఏరియాలకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలన్నారు.

ఓటర్లలో పోటెత్తిన చైతన్యం

- నియోజకవర్గంలో భారీగా పోలింగ్ నమోదు
- పిఠాపురం మండలంలో అత్యధికంగా 88.62 శాతం

పిఠాపురం: నియోజకవర్గంలోని ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మునుపెన్నడూ లేనివిధంగా పెద్ద ఎత్తున ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓట్లేశారు. అత్యధిక శాతం మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకుని రాష్ట్రం మొత్తం పిఠాపురం నియోజకవర్గం వైపు చూసేలా చేశారు. పిఠాపురం నియోజకవర్గంలో 2,36,409 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 118183 మంది, స్త్రీలు 118223 మంది, ఇతరులు ముగ్గురు ఉన్నారు. వీరిలో 103370 మంది పురుషులు, 101438 మంది స్త్రీలు, ట్రాన్స్‌జెండర్స్ 3 ఓటర్లు వెరసి మొత్తం 204811 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 2019లో 80 శాతం పోలింగ్ నమోదు కాగా ప్రస్తుతం 86.63 శాతం పోలింగ్ నమోదైంది. పిఠాపురం మండలంలో అత్యధికంగా 88.62 శాతం పోలింగ్ నమోదు కాగా, పిఠాపురం పట్టణంలో 83.48 శాతం అత్యల్ప పోలింగ్ నమోదైంది.

వివరాలు ఇలా..

పిఠాపురం మండలంలో 62093 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 31468 మంది, స్త్రీలు 30625 మంది ఉన్నారు. వీరిలో 28246 మంది పురుషులు, 26779 మంది స్త్రీలు వెరసి మొత్తం 55025 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పిఠాపురం పట్టణంలో 42829 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 20669 మంది, స్త్రీలు 22159 మంది ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. వీరిలో 17434 మంది పురుషులు, 18318 మంది స్త్రీలు, ఒక ట్రాన్స్‌జెండర్ వెరసి మొత్తం 35753 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. కొత్తపల్లి మండలం 211వ నంబర్ బూత్‌లో అత్యధికంగా 94.88 శాతం మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇప్పటికే హాట్ టాపిక్‌గా మారిన పిఠాపురం నియోజకవర్గంలో అత్యధిక శాతం ఓటింగ్ నమోదు కావడంతో మరింతగా వార్తల్లో నిలుస్తోంది. ఎక్కువగా నమోదైన పోలింగ్ ఎవరిని పీఠం ఎక్కిస్తుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

పెరిగిన పోలింగ్ శాతం

సామర్లకోట: ఈ ఎన్నికల్లో ఓటర్ల చైతన్యం పెరిగింది. అధిక శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో 2,15,095 మంది ఓటర్లకు 1,76,987 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 201 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ రోజు ఉదయం ఏడు గంటల నుంచి ఓటర్లు బారులు తీరి కనిపించారు. నియోజకవర్గంలో 2,15,095 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,09,294 మంది స్త్రీలు, 1,05,788 మంది పురుషులు, 13 మంది ఇతరులు ఉన్నారు. మొత్తం 82.29 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.సీతారామారావు ప్రకటించారు. ఇందులో 88,895 మంది స్త్రీలు, 88,090 మంది పురుషులు, 8 మంది ఇతరులు ఉన్నారు. సామర్లకోట మండలం పండ్రవాడలోని 187వ పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 93.36 శాతం, పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలోని 81వ పోలింగ్ కేంద్రంలో అత్యల్పంగా 54.38 శాతం మంది ఓటర్లు తమ ఓటు వినియోగించుకున్నారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన



పిఠాపురం నియోజకవర్గ స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఆర్వో రామ్‌సుందర్‌రెడ్డి

కాకినాడ సిటీ: పిఠాపురం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి శుక్రవారం స్థానిక జేఎన్టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో ఏర్పాటు చేసిన ఈవీఎంలు ఇతర ఎన్నికల సామగ్రి భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల అధికారులతో కలసి స్ట్రాంగ్ రూమ్‌కు వెళ్లి భద్రతా ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

సామర్లకోట: మండలంలో రెండో విడతలో మంజూరైన నిధులకు సంబంధించి పనులను వేగంగా పూర్తి చేయాలని మండల విద్యాశాఖాధికారులు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్యలు హెచ్‌ఎం, ఇంజినీరింగ్ అసిసెంట్లను ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పాఠశాలలు తెరిచే నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. శనివారం నుంచి ప్రతి పాఠశాలలో హెచ్‌ఎంలు అందుబాటులో ఉండి పనులను పర్యవేక్షించాలన్నారు. ఈ మేరకు కాంట్రాక్టర్లతో చర్చించాలని సూచించారు. పనులు పూర్తి చేయకపోతే నిధులు వెనక్కిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

ఏలేశ్వరం: పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. పట్టణంలో గత రెండు రోజులుగా దుర్గారావు, సుధీర్ మెమోరియల్ కికెట్ టోర్నీని నిర్వహిస్తున్నారు. పట్టణానికి చెందిన పలు జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. రోజుకు రెండుమ్యాచ్‌లు చొప్పున నిర్వహిస్తున్నారు. శుక్రవారం పోటీలు హోరాహోరీగా సాగడంతో చూసేందుకు భారీగా యువకులు, ప్రజలు తరలివచ్చారు. పోటీల్లో విన్నర్ జట్టుకు రూ.33,333 రన్నర్స్‌కు రూ.22,222 నగదు బహుమతులు ఇవ్వనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

స్వచ్ఛత బాధ్యత సెక్రటరీ, మేస్త్రిలదే

- కమిషనర్ రామారావు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో చెత్త లేకుండా స్వచ్ఛంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత సచివాలయ శానిటరీ సెక్రటరీలు, మేస్త్రిలపై ఉందని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అన్నారు. శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో 'చెత్తపై చిత్తశుద్ధి ఏదీ?' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి కమిషనర్ స్పందించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ తన చాంబర్‌లో శానిటరీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. చెత్త ఎక్కడ ఉంటుందో గమనించి దానిని శానిటరీ వర్కర్లతో తొలగించే బాధ్యత కార్యదర్శులు, మేస్త్రిలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య ట్రాక్టర్లకు చెత్త అందించడానికి మహిళా వర్కర్లను వినియోగించాలన్నారు. ఉదయం 5.30 గంటలకు మస్తరు వేయాలని, మస్తరు వేయడానికి ఆలస్యంగా వచ్చిన సెక్రటరీలు, కార్యదర్శులపై చర్యలు ఉంటాయన్నారు. సిబ్బందే సమయపాలన పాటించకపోతే వర్కర్లు ఏవిధంగా పనిచేస్తారని కమిషనర్ ప్రశ్నించారు. సెక్రటరీలు, మేస్త్రిలు పారిశుధ్య సిబ్బందితో స్నేహభావంతో ఉండి పని చేయించుకోవాలన్నారు. తరచూ విధులకు డుమ్మా కొట్టే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో చెత్త కనిపిస్తే ఆయా ప్రాంతాలకు చెందిన సెక్రటరీ, మేస్త్రిలకు నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. శానిటరీ ట్రాక్టర్లు మరమ్మతులకు గురైతే వెంటనే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. మినీ శానిటరీ వాహనాల మరమ్మతులకు సంబంధించి ఆ సంస్థ ప్రతినిధితో చర్చించామన్నారు. మూడు రోజుల్లో ఆ వాహనాలను వినియోగంలోకి తీసుకు వస్తామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



శానిటరీ సెక్రటరీలు, మేస్త్రిల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

సాక్షి ఇంపాక్ట్

తాటిముంజెలకు భలే గిరాకీ

సామర్లకోట: వేసవిలో ప్రజలు ఇష్టంగా తినేవి తాటి ముంజెలు. ఇందులో నీటిని తాగడం ఆరోగ్యానికి ఎంతో మేలని వైద్యులు చెబుతున్నారు. మెట్ట ప్రాంతంలోని సామర్లకోట, పెద్దాపురం మండలాల్లో ఎక్కువగా తాటి చెట్లు ఉంటాయి. అయితే పొలాలను లేఅవుట్‌లుగా మార్చేయడంతో ఆ చెట్లు కనుమరుగవుతున్నాయి. దాంతో తాటి ముంజెలను సామాన్య ప్రజలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. గత ఏడాది 12 ముంజెలు రూ.50 ఉండగా, ప్రస్తుతం రూ.60కు విక్రయిస్తున్నారు. నేడు తాటి చెట్లు ఎక్కువగా లేకపోవడం, చెట్లు ఎక్కేవారు కానరాక డిమాండ్ ఏర్పడుతుంది. పెద్దాపురం మండలం దివిలి గ్రామానికి చెందిన దేవుడు మూగవ్యక్తి. అయినా కొన్నేళ్లుగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ముంజెలు విక్రయిస్తున్నాడు. ఆనూరు, కొండపల్లి, ఆర్బీ కొత్తూరు గ్రామాల్లో రైతుల పొలాలకు వెళ్లి ముంజె కాయలను దింపి వాటిని విక్రయిస్తున్నట్లు తన సైగల ద్వారా చెప్పాడు. తెల్లవారుజామునే సుమారు 20 కిలోమీటర్ల దూరం వెళ్లి పది చెట్లు ఎక్కితే 100 ముంజెకాయలు దింపడం కష్టం అవుతుందని అంటున్నాడు.



సామర్లకోటలో తాటిముంజెలు విక్రయిస్తున్న వ్యక్తి

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ డీఎస్పీ హనుమంతరావు

- కాకినాడ డీఎస్పీ హనుమంతరావు

పిఠాపురం: ఎన్నికల్లో పార్టీల పరంగా ఎవరికి వారు ప్రచారం చేసుకున్నా, ఎన్నికల అనంతరం అందరూ కలిసి ఉండాలి తప్ప ద్వేషాలు పెంచుకుని విధ్వంసాలకు పాల్పడితే కేసుల్లో ఇరుక్కుని జీవితాంతం బాధపడాల్సి వస్తుందని కాకినాడ డీఎస్పీ హనుమంతరావు ప్రజలకు సూచించారు. పిఠాపురం మండలం విరవాడలో శుక్రవారం ఆయన స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల పోలింగ్ సందర్భంగా విరవాడలో తలెత్తిన వివాదం నేపథ్యంలో గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఎన్నికల కేసుల్లో ఇరుక్కుంటే తప్పించుకునే అవకాశం ఉండదని, ప్రతి ఎన్నికల సమయంలోనూ వారు నిందితులుగా ఉంటారన్నారు. ఎన్నికలను రాజకీయ కోణంలో చూడాలి తప్ప, గ్రామాల్లో ప్రజల మధ్య చిచ్చు పెట్టేటట్లు చేయకూడదన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో గ్రామంలో శాంతి యుత వాతావరణం ఉండేలా గ్రామస్తులంతా సహకరించాలన్నారు. ఎవరైనా ఉద్రేకాలకు లోనై ఇతరులను రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గ్రామంలో సెక్షన్ 144, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ప్రజలు గుంపులు గుంపులుగా తిరగరాదన్నారు. అనుమతి లేకుండా సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త ఆవిష్కరణలు రూపొందించాలి

పెద్దాపురం: విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెట్టి సరికొత్త ఆవిష్కరణలు రూపొందించాలని జేవీవీ సైన్స్ అండ్ టెక్నాలజీ జిల్లా కన్వీనర్ బుద్ధా శ్రీనివాస్ అన్నారు. స్థానిక వరహాలయ్య పేట యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శుక్రవారం సైన్స్ ప్రయోగాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. సైన్స్ ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం దుంగల పూజిత సూర్యశ్రీ విద్యార్థులకు కరాటే శిక్షణ ఇవ్వగా, నీలపాల కృష్ణ విద్యార్థులకు కర్రసాము విద్యను నేర్పించారు. కార్యక్రమంలో సమ్మర్ క్యాంప్ నిర్వాహకులు రొంగల అరుణకుమార్, మంజుల, సాయి, బంగారం, మణికంఠ, కుమారి, అమృత, నమ్రత, కూనిరెడ్డి రవికుమార్, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

చివరిలో కలవరం

- అన్నదాతలను వెంటాడుతున్న అకాల వర్షాలు
- ఆదరాబాదరాగా పంట ఒబ్బిడి

ప్రత్తిపాడు: రబీ వరిసాగు చేసిన రైతులు అకాల వర్షాలకు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం అనుకూలించడంతో నిన్నమొన్నటి వరకూ రబీ సాగు సజావుగా సాగింది. పంట చేతికి వచ్చే తరుణంలో వాతావరణ మార్పులతో పాటు వర్షాలు అకాల వర్షాలు కురవడంతో అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. వాతావరణంలోని ప్రతికూల పరిస్థితిని చూసి రైతుల గుండె చెరువుగా మారుతోంది. అకాల వర్షాల నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు.

4,500 ఎకరాల్లో సాగు

ప్రత్తిపాడు మండలంలో ఈ ఏడాది సుమారు 4,500 ఎకరాల్లో రైతులు రబీ వరిసాగు చేపట్టారు. రైతులు ఎక్కువగా ఎంటీయూ 1156, 1121, ప్రైవేటు వంగడాలైన లీడరు, సంపద, సాధన తదితర రకాలను సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికి వచ్చే దశకు చేరుకుంది. వాతావరణ మార్పులను గమనించిన రైతులు ఆదరా బాదరాగా కోతలు మొదలు పెట్టారు. పలు గ్రామాల్లో ఇప్పటికే రైతాంగం పంటను ఒబ్బిడి చేసుకుంది. ప్రత్తిపాడు, ఏలూరు, లంపకలోవ, పెదశంకర్లపూడి, శరభవరం, గజ్జనపూడి, చింతలూరు తదితర గ్రామాల్లో ధాన్యం రాశులు ఉన్నాయి. రెండు రోజుల పాటు చదురుమదురుగా వర్షాలు కురవడంతో కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులను బరకాలు, ప్లాస్టిక్ కవర్లతో కప్పారు. శుక్రవారం వర్షం విరామం ఇచ్చింది. దీంతో రైతులు తడిసిన ధాన్యం రాశులను రోడ్లపై ఆరబెట్టారు. వ్యవసాయ శాఖ జగ్గంపేట ఇన్‌చార్జి ఏడీఏ యింటి వీర గంగాధర్ తన సిబ్బందితో ప్రత్తిపాడు, ఏలూరు, టి.రాయవరం తదితర గ్రామాల్లో పర్యటించారు. వర్షం నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. తడిసిన వరి పనలపై ఐదు శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు.



ప్రత్తిపాడు- లంపకలోవ రహదారిపై ఆరబెట్టిన ధాన్యం

భావనారాయణస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



సర్పవరం భావనారాయణ స్వామి, రాజ్యలక్ష్మి అమ్మవారు

కాకినాడ రూరల్: సర్పవరంలో వేంచేసి ఉన్న రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం స్వామి, రాజ్యలక్ష్మీ అమ్మవారికి కల్యాణం జరుగనుంది. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 5 గంటలకు భావనారాయణ స్వామి, రాజ్యలక్ష్మి అమ్మవార్లకు పంచామృత అభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రాలతో పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా ముస్తాబు చేశారు. అర్చకులు విశేష అర్చన చేశారు. సాయంత్రం ధ్వజరోహణ, దీక్షధారణ నిర్వహించి గరుగ పొంగలి నివేదించారు. సంతానం కావాల్సిన వారు గరుడ పొంగలిని ప్రసాదంగా సంతానం ప్రాప్తిస్తుందని నమ్మకం ఉండడంతో భక్తులు స్వీకరించేందుకు పోటీ పడ్డారు. సాయంత్రం 6.30 గంటలకు తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి ఆలయంలో..

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం నుంచి 24 వరకూ వార్షిక కల్యాణ మహోత్సవాలు జరుగుతాయని ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం స్వామి అమ్మవార్లకు పంచామృతాభిషేకం, అలంకారం, అర్చన, 19న ధ్వజారోహణం, గ్రామోత్సవం, స్వామి కల్యాణోత్సవం, 21న సదస్య మహోత్సవం, 23న పూర్ణాహుతి, చక్రతీర్థం, 24న శ్రీపుష్ప యాగం వైభవంగా జరుగుతాయన్నారు.

శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానం

కొమరగిరి గ్రామం, ఉప్పాడ కొత్తపల్లి మండలం, కాకినాడ జిల్లా

పై దేవస్థానమునకు కాకినాడ జిల్లా ఉప్పాడ కొత్తపల్లి మండలం కొమరగిరి, పండ్రవాడ గ్రామాల నందు స్వామి వారికి చెందిన య.7.71 సెంట్లు భూమి 3 ప్రతులుగా 2024-25 నుండి 2026-27 వరకు మూడు సంవత్సరముల వ్యవసాయ హక్కునకు 29-5-2024 మధ్యాహ్నం 2.00 గంటలకు స్వామి వారి ఆలయం వద్ద దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించబడును. కావున ఆసక్తి గలవారు వేలం నందు పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.

తేది : 17-05-2024 కార్యనిర్వహణాధికారి

శ్రీ జగన్నాథ స్వామి వారి దేవస్థానం

మూలపేట గ్రామం, యు.కొత్తపల్లి మండలం, కాకినాడ జిల్లా

పై దేవస్థానమునకు కాకినాడ జిల్లా ఉప్పాడ కొత్తపల్లి మండలం మూలపేట, అమరవిల్లి, యండపల్లి గ్రామాల నందు స్వామి వారికి చెందిన య.29.38 సెంట్లు భూమి 4 ప్రతులుగా 2024-25 నుండి 2026-27 వరకు మూడు సంవత్సరముల వ్యవసాయ హక్కునకు మరియు సర్వే తోట కౌలుకు 5 సం॥లు 2024-25 నుండి 2028-29 వరకు ది. 29-5-2024 ఉదయం 10.00 గంటలకు స్వామి వారి ఆలయం వద్ద దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించబడును. కావున ఆసక్తి గలవారు వేలం నందు పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.

తేది : 17-05-2024 కార్యనిర్వహణాధికారి